## క్లుప్తంగా

### 104 ఉద్యోగుల జీతాలు పెంచాలి



మాట్లాడుతున్న విక్టర్

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని 104 విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగుల జీతాలు పెంచాలని ఆ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విక్టర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు అందిస్తున్న 104 సేవలతో ప్రభుత్వానికి మంచిపేరు తెస్తున్నమన్నారు. కొత్తగా నివేదించిన ఆర్ఎఫ్‌పీలో ఉద్యోగుల సమస్యల ప్రస్తావన లేదన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు, డ్రైవర్లందరికీ స్లాబ్ అమలు చేయాలన్నారు. ఇవి యథావిధిగా అమలయ్యేలా ఆర్ఎఫ్‌పీలో పొందుపరచాలన్నారు. సీటీసీ విధానాన్ని రద్దు చేసి ఈపీఎఫ్‌లో యాజమాన్యం వాటా చెల్లించాలన్నారు. ఈఎస్ఐను ఆర్ఎఫ్‌పీలో పొందుపరిచి ఉద్యోగులకు వెయిటేజీ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల నియమకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గతంలో మాదిరి ఉద్యోగులకు ఫుడ్ అలవెన్సులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

### నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలియజేశారు.

### గజ దాడుల శాశ్వత పరిష్కారానికి చర్యలు ప్లీజ్!

–అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతి



ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఉమాపతినాయుడు

బంగారుపాళెం: ఏనుగుల దాడులకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదివారం ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెక్రటరీకి వినతి పత్రాన్ని సమర్పించినట్లు ఏఐకేఎంఎస్ జిల్లా రైతు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఉపాపతి నాయుడు, వెంకట్రామిరెడ్డి తెలిపారు. పలమనేరు పట్టణ సమీపంలో కుంకీ ఏనుగుల కోసం ఏర్పాటు చేయనున్న శిబిరాలను పరిశీలించేందుకు విచ్చేసిన రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ చిరంజీవిచౌదరిని రైతు సంఘ నాయకులు కలిశారు. జిల్లాలో ఏనుగు దాడుల వల్ల జరుగుతున్న పంట నష్టం, ఏనుగు దాడుల జరగకుండా రైతుల పంటలకు రక్షణ కల్పించాలని కోరినట్లు చెప్పారు. తమిళనాడు, కర్ణాటక నుంచి జిల్లాలోకి వచ్చిన ఏనుగులు గుంపులుగా విడిపోయి జిల్లాలోని అటవీ సరిహద్దు ప్రాంతాలైన కుప్పం, రామకుప్పం, పలమనేరు, బంగారుపాళెం, పులిచర్ల తదితర ప్రాంతాల్లో సంచరిస్తూ రైతుల పంటలను, వ్యవసాయ బావుల వద్ద షెడ్లు, బోర్లను ధ్వంసం చేస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. రైతులు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకునేందుకు 100 శాతం రాయితీ కల్పించాలని కోరామన్నారు. అలాగే ఏనుగుల దాడిలో దెబ్బతిన్న పంటలకు ప్రస్తుతం ఇస్తున్న పరిహారాన్ని రెండు రెట్లు పెంచి ఇవ్వాలని కోరినట్టు చెప్పారు.

### రహదారి బాగు చేయరూ!

–సీఎంకు సర్పంచ్ వినతి



రోడ్డు సమస్యపై సీఎంకు వినతి పత్రం ఇస్తున్న సర్పంచ్

బంగారుపాళెం: గుంతలమయిన రాగిమానుపెంట గ్రామ రహదారిని బాగు చేసేందుకు చొరవ చూపాలని కోరుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వినతి పత్రం ఇచ్చినట్టు ఆదివారం సర్పంచ్ శ్రీహరి తెలిపారు. బంగారుపాళెం నుంచి రాగిమానుపెంటకు మధ్య ఉన్న 8 కిలోమీటర్ల రహదారి అధ్వానంగా ఉందని, రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా ఉందని సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. రాగిమానుపెంట పంచాయతీతో పాటు వెలుతురుచేను, కేఎం కండ్రిగ, కీరమంద, కొదలమడుగు పంచాయతీల పరిధిలోని గ్రామస్తులు, విద్యార్థులు, రాగిమానుపెంట రహదారి మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారన్నారు. దీంతోపాటు తమిళనాడు నుంచి ఆంధ్రాకు లింక్ రోడ్డు కలిగి ఉండడంతో చాలా మంది భక్తులు కాణిపాకం, మొగిలి శివాలయాలకు రాకపోకలు సాగిస్తుంటారని, అధ్వానంగా ఉన్న రహదారిని బాగు చేయాలని జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని సీఎంకు తెలియజేసినట్టు పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారన్నారు.

## కంకర..ప్రయాణం హరహరా..!



అరగొండ–చిత్తూరు ప్రధాన రహదారిలో బ్రాహ్మణపల్లె రోడ్డు దగ్గర రోడ్డుపై పోసిన కంకర

తవణంపల్లె: అరగొండ–చిత్తూరు ప్రధాన రహదారిలో గోతులు అధికంగా ఉండడంతో సంబంధిత అధికారులు తాత్కాలిక మరమ్మతులకు పూనుకున్నారు . మండలంలోని ఉత్తర బ్రాహ్మణపల్లె రోడ్డు దగ్గ ఈ పనులకు సంబంధించి రోడ్డుపై కంకర గుల్ల వేశారు. ఆపై దాదాపు రెండు వారాలు గడచినా తారురోడ్డు వేయక పోవడంతో కంకర దుమ్ము రేగుతోంది. గుల్లపై వాహన చోదకులు, ప్రజల రాకపోకలకు నానాఅవస్థలు పడుతున్నారు. రోడ్డు పక్కన నివసిస్తున్న ప్రజలు సైతం ఇబ్బంది పడుతున్నారు. ఇకనైనా పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## కంపు..కంపు



ఉత్తరబ్రాహ్మణపల్లెలో రోడ్డుపై నిల్వచేరిన మురుగునీరు

తవణంపల్లె: మండలంలోని ఉత్తరబ్రాహ్మణపల్లెలో డ్రైనేజీ మురుగునీరు రోడ్డుపై పారుతుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో పైపులైన్ నుంచి మురుగునీరు వెళ్తోంది. కొందరు పైపులు మూసివేయడంతో ఇళ్ల నుంచి వచ్చే డ్రైనేజీ నీరు రోడ్డెక్కుతోంది. దుర్వాసన చిమ్ముతోంది. దీంతో ముక్కులు మూసుకుని వెళ్లవలసి వస్తోందని గగ్గోలు పెడుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. నాలుగు రోజుల్లో పైపులైన్ల పనులు పూర్తి చేసి వాగులోకి మురుగునీరు మళ్లించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు.

## 'దుమ్ము'..రోగాలు కమ్ము..!



లారీ వెళుతుంటే రేగుతున్న దుమ్ము

యాదమరి(కాణిపాకం): యాదమరి మండలంలోని పోలీస్ స్టేషన్ నుంచి కనికాపురం వరకు రోడ్డు నిర్మాణ పనుల మూలాన రేగుతున్న దుమ్ము, ధూళితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు ఇరువైపులా నివాసం ఉన్నవారు ప్రధానంగా అవస్థలు పడుతున్నారు. రోడ్డు పనులకుగాను కంకర పోసి..దానిపై కంకర డస్ట్ చల్లి వదిలేశారు. ఈ రోడ్డుపై వాహనాలు వెళ్లిన ప్రతిసారీ ఆ దుమ్ము రేగుతూ రోడ్డుతోపాటు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లను కమ్మేస్తుండడంతో శ్వాసకోశ సంబంధిత సమస్యల బారిన పడుతున్నారు. దీనిపై స్థానికులు కాంట్రాక్టర్లను ప్రశ్నిస్తే పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. రోడ్డు పనుల్లో కంకర డస్ట్‌పై విధిగానీళ్లు పోసి రేగకుండా చూడాల్సి ఉంది. అయితే ఆ దిశగా ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని పలువురు మండిపడుతున్నారు.

## మదినిండా సంతోషం...!



జెడ్పీ హైస్కూల్ స్వర్ణోత్సవంలో పూర్వ విద్యార్థులు

- వేడుకగా పూతలపట్టు హైస్కూల్ స్వర్ణోత్సవం
- సందడి చేసిన పూర్వ విద్యార్థులు

పూతలపట్టు (కాణిపాకం): ఎక్కడెక్కడి నుంచో వచ్చిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన సంబరం అంబరాన్ని తాకింది. నాటి సంగతులను గుర్తుకు తెచ్చుకుని ఆనందడోలికల్లో మునిగితేలారు. ఆదివారం పూతలపట్టులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 50 ఏళ్ల స్వర్ణోత్సవం కోలాహలంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సందడి చేశారు. తమ అభ్యున్నతికి బాటలు వేసిన అప్పటి గురుదేవులు జయరామి నాయుడు, సుబ్రమణ్యం రెడ్డి, శకుంతలను ఘనంగా సన్మానించారు. వారి ఆశీస్సులు పొందారు. అనంతరం 1974–75 బ్యాచ్ విద్యార్థులు పాఠశాలకు రూ.15వేల విరాళం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈఓ బాలాజీ, విశ్రాంత ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, విశ్రాంత జడ్జి చెంగల్రాయనాయుడు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 'నులి'మేద్దాం..!

పిల్లలలో పలు రుగ్మతలకు కారణమైన నులి పురుగుల నిర్మూలనకు రంగం సిద్ధమైంది. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినం సందర్భంగా ఆల్బెండ్ జోల్ మాత్రల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. నులి పురుగుల వల్ల శారీరక పెరుగుదల తగ్గుముఖం పడుతుంది. ఆకలి మందగించడం బలహీనత, ఆందోళన, కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, మలంలో రక్తం పడడం వంటి లక్షణాలు కనిపిస్తే నులి పురుగులు ఆశించినట్లు అనుమానించాల్సిందే. భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కుంటే కొంతవరకు నులి పురుగులను నివారించవచ్చని వైద్యులు చెప్పారు. సోమవారం డీ వార్మింగ్ డే సంద ర్భంగా 19 ఏళ్ల లోపు వారందరికీ మాత్రలు పంపిణీ చేయనున్నారు.

- నేడు డీ వార్మింగ్ డే
- పంపిణీకి ఆల్బెండజోల్ మాత్రలు సిద్ధం

కాణిపాకం: జిల్లాలో 19 ఏళ్ల లోపు వారు 3,63,888 మంది ఉన్నట్లు గుర్తించారు. 2,420 అంగన్‌వాడీ కేంద్రాల్లో గల 78,924 మంది చిన్నారులకు మాత్రలు మింగించాలని నిర్దేశించారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 2883 ఉండగా 2,36,691 మంది పిల్లలకు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు 163 ఉండగా 43,787 మందికి, బడి బయట పిల్లలకు 4,486 మందికి మాత్రలు ఇచ్చే దిశగా ఉపక్రమించారు. ఇందులో 1 నుంచి 2 ఏళ్ల లోపు పిల్లలకు సగం మాత్ర వేయాలి. ఆపై వయసున్న వారిచే ఒక మాత్ర మింగించాలి.



విద్యార్థులకు ఇవ్వనున్న అల్బెండజోల్ మాత్రలు

### నిర్లక్ష్యం చేయకండి



ప్రధానంగా విద్యార్థులలో రక్తహీనత నిర్మూలనకు కార్యాచరణ చేపట్టాం. అలాగే వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాం. చిన్నారులందరికీ మాత్రలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. జిల్లాను వివిధ రూట్లుగా విభజించి సరిపడా సిబ్బందిని నియమించాం. ఈవిషయంలో వైద్యబృందం నిర్లక్ష్యం చేయకూడదు. వైద్య సూత్రాలు కచ్చితంగా పాటించాలి. బాధ్యతగా తీసుకుని వంద శాతం కార్యక్రమం పూర్తయ్యేలా చూడాలి.

– వెంకటప్రసాద్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ, చిత్తూరు

### • రైల్వే గేటు కమ్మీల్లో చిక్కుకున్న ఆవు



చిత్తూరు కార్పొరేషన్: రైల్వే గేటు సమీపంలో ఉండే కమ్మీల్లో ఆవు చిక్కుకున్న సంఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానిక మెసానికల్ మైదానం వద్ద రైలు గేటు ఉంది. స్థానిక పశువుల కాపరి ఆవు మేత కోసం అటువైపు తీసుకెళ్లాడు. ఆవు గేటు సమీపంలో మేత మేస్తూ వెళ్లి కాలుజారి కమ్మీల్లో ఇరుక్కుపోయింది. స్థానికుల సాయంతో గంట సేపు పైగా శ్రమించి ఆవును సురక్షితంగా వెలికి తీశారు. తదనంతరం ప్రథమ చికిత్స చేయించారు.

### ముగ్గురు డాక్టర్లకు మెమోలు

చౌడేపల్లె: ప్రభుత్వాస్పత్రికి వైద్యసేవల కోసం వచ్చిన చిన్నకొండామర్రికు చెందిన షవ్యశ్రీ పట్ల దురుసుగా ప్రవర్తించిన ముగ్గురు వైద్యులకు శనివారం చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి సుధారాణి మెమో జారీచేశారు. శనివారం సాక్షిలో ప్రచురితమైన ‘రోగిపై దురుసు ప్రవర్తన’ కథనంపై ఆమె స్పందించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు నెలసరి సమస్యతో ఇబ్బంది పడుతున్న రోగి, వైద్యసేవల కోసం డాక్టర్ పూజకు వివరిస్తుండగా అదే గదిలో డాక్టర్ నవీన్‌తేజ్ ఉండడం, విధులు నిర్వహించకుండా సెల్‌ఫోన్‌లో యూట్యూబ్ చూస్తుండగా సౌండ్ ఎక్కువగా ఉందని డాక్టర్ చెప్పేది వినపడడం లేదని రోగి అనడంతో రోగి పట్ల హేళనగా వ్యవహరించడంపై డీఎంహెచ్‌ఓ డాక్టర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ పూజ, డాక్టర్ నవీన్‌తేజ్, డాక్టర్ పవన్‌కుమార్‌లకు మెమో జారీచేశారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యకేంద్రానికి హాజరై సంజాయిషీ ఇవ్వాల్సిందిగా కోరుతూ మెమోలో పేర్కొన్నారు.

### ఉర్దూ జేఏసీ అధ్యక్ష, కార్యదర్శుల నియామకం





మహ్మద్‌అలీ, రహంతుల్లా

పలమనేరు: జిల్లా ఉర్దూ మీడియం పాఠశాలల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా మహ్మద్ అలీ, రహంతుల్లా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. స్థానిక ఉర్దూ పాఠశాలలో ఆదివారం ఈ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నట్టు ఆప్టా మునాఫ్ తెలిపారు.

### నేడు పాలకలలో 'ఫ్యామిలీ డాక్టర్'

ఐరాల: మండలంలోని పాలకలలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తామని వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గ్రామీణులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**ఐరాలలో 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'**

ఐరాల: తమ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని, మండల ప్రజలు సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ మహేష్‌కుమార్ తెలిపారు.

### తైపూస మహోత్సవం రేపు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వెంకటేష్ తదితరులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): తైపూస మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కాలభైరవ ట్రస్టు చైర్మన్ వెంకటేష్ పిలుపునిచ్చారు. చిత్తూరులోని ట్రస్టు కార్యాలయంలో ఆదివారం తైపూస కరపత్రాలను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. మంగళవారం చెంగాల్రాయ కొండపై శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో తైపూస పూజలు చేస్తామన్నారు. ప్రధానంగా పాలాభిషేకం నిర్వహిస్తామని, ఈనేపథ్యంలో సీబీ రోడ్డు నుంచి పాల బిందెలతో ఊరేగింపు ఉంటుందన్నారు.

### అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహిద్దాం

పూతలపట్టు(కాణిపాకం): పూతలపట్టు మండలంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆ మండల దళిత నాయకులు నిర్ణయించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. అంబేడ్కర్ జయంతి నిర్వహణపై చర్చించారు. బడుగు బలహీన వర్గాల ప్రజలందరూ ఈ వేడుకల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జీవరత్నం, చిత్తూరు చుడా జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ షణ్ముగం, రామమూర్తి, వెంకటరమణ, జయపాల్, కంజేరి షణ్ముగం, ఉమాపతి, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

### సారా స్వాధీనం: ముగ్గురి అరెస్టు



చిత్తూరు అర్బన్ : నాటుసారా విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను చిత్తూరు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సీఐ పవన్ కథనం.. యాదమరి మండలం తెల్లరాళ్లపల్లెలో నాటుసారా తయారు చేస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. అక్కడ సారా విక్రయిస్తున్న శంకర్, బాలకృష్ణ, శరవణ అనే ముగ్గురు సారా తయారు చేయడం, విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. నిందితుల వద్ద నుంచి 37 లీటర్ల నాటుసారా, రెండు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే రంగనాయక చెరువు అటవీ ప్రాంతంలో నిల్వ చేసిన 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎస్ఐ సుబ్రమణ్యం, సిబ్బంది దేవప్రసాద్, రాజేష్, ఢిల్లీబాబు, హేమాద్రి, దీప పాల్గొన్నారు.

## ఉరకలేసిన ఉత్సాహం



వెదురుకుప్పం: ఉత్సాహం ఉరకలేసింది... కోడె గిత్తలు రంకెలేశాయి...జనసమూహంలో దూసుకుపోయిన పోట్ల గిత్తలు తమ పౌరుషాన్ని చూపాయి. ఎడ్లను నిలువరించేందుకు యువత పోటీ పడింది. సంక్రాంతి సంబరాలలో భాగంగా మండలంలోని పాతగుంటలో ఆదివారం జల్లికట్టు నిర్వహించారు. యువత కేరింతలు మధ్య జల్లికట్టు దుమ్ము రేపింది. యువత ఆధ్వర్యంలో గ్రామంలో పశువుల పందేల నిర్వహణకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ముందుగా ఎడ్లకు పలకలు, వస్త్రాలతో పాటు బెలూన్లు కట్టి పందేనికి సిద్ధం చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రాలతో కూడిన పలకలు, పార్టీ జెండాలతో కోడె గిత్తలను ప్రత్యేకంగా అలంకరించారు. అంతకు ముందే వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యువత అక్కడికి చేరుకున్నారు. పలకల కోసం అల్లి వద్ద సిద్ధంగా యువత నిలబడడంతో నిర్వాహకులు ఎడ్లను ఉసిగొల్పారు. కొందరు యువకులు కోడె గిత్తలను కట్టడి చేసి పలకలను దక్కించుకుని విజయ దరహాసంతో చిందులు వేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన వారితో గ్రామం జనంతో కిక్కిరిసింది. స్థానిక సర్పంచ్ భువనేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బొజ్జారెడ్డి, యువత ఏర్పాట్లు చేశారు.

## సూర్యఘర్‌తో ఇంట్లో వెలుగులు

రోజురోజుకూ ప్రజలకు విద్యుత్ బిల్లుల భారం పెరుగుతుందే కానీ తగ్గడం లేదు. ప్రతి నెలా విద్యుత్ బిల్లును చూసి వామ్మో..! ఇంత బిల్లు వచ్చిందా..? అని నోరువెళ్లబెట్టని వారు ఉండరు. అయితే సహజ వనరులను వినియోగించుకుని గుదిబండలాంటి విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకునే అవకాశం కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోంది. మన ఇంట్లోనే సూర్యరశ్మి ఆధారంగా విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజీ యోజన పథకాన్ని తీసుకొచ్చింది. దీనికి రాయితీ ఇస్తూ గృహ వినియోగదారులను ప్రోత్సహిస్తోంది.



- సౌర ఫలకాలతో ఇంట్లోనే విద్యుత్పత్తి
- సబ్సిడీతో పాటు రుణ సదుపాయం కల్పిస్తున్న కేంద్రం
- నెట్ మీటర్‌తో విద్యుత్ ఉత్పత్తి, వాడకం
- విద్యుత్ బిల్లు తగ్గించుకునేందుకు అవకాశం

నగరి: సూర్యఘర్ పథకం వినియోగించుకోవడానికి విద్యుత్ వాడకం 300 యూనిట్లలోపు ఉండాలనే నిబంధన ఉంది. అనంతరం ట్రాన్స్‌కో అనుమతులు పొందాక వెండర్లను ఎంపిక చేసుకోవాలి. ఇందులో కిలో వాట్‌కు నిర్ణయించిన ప్రకారం సబ్సిడీ ఇస్తారు. మిగిలిన మొత్తానికి బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తారు. చివరగా ఇంటి పైభాగంపై వంద చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానల్స్ (సౌర ఫలకాలు) ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం వాడే మీటరు స్థానంలో నెట్ మీటరు ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా సోలార్ ఉత్పత్తి.. వినియోగదారుడు వాడుతున్న విద్యుత్తును లెక్కించే అవకాశం ఉంటుంది.

**30 రోజుల్లోనే సబ్సిడీ**

నెట్ మీటరు అమర్చిన తరువాత పోర్టల్‌లో బ్యాంకు ఖాతా వివరాలు అప్‌లోడ్ చేయాలి. సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం 30 రోజుల్లో చెల్లిస్తుంది. ఒక కిలో వాట్ రూఫ్ కెపాసిటీ కోసం 3–4 ప్యానల్స్(ఒక మీటరు వెడల్పు,1.6 మీటర్ల ఎత్తు) అమర్చుతారు. కిలో వాట్ సోలార్‌రూటార్ ప్యానల్ నెలకు దాదాపు 125పై యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. సోలార్ రూటాప్ ప్యానల్స్ సూర్యుడి వేడిని గ్రహించడం వల్ల ఇల్లు చల్లగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. వినియోగదారులు పెట్టిన పెట్టుబడి 6 నుంచి 7 ఏళ్లలో తిరిగి పొందగలరని సోలార్ కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు.

**దరఖాస్తు చేసుకోవాల్సింది ఇలా..**

ఈ పథకం కింద ప్రయోజనం పొందాలంటే తొలుత సూర్యఘర్ యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో వివరాలు నమోదు చేసుకోవాలి. ఆరు నెలల కరెంటు బిల్లుల కాపీలను జతపరచాలి. తరువాత రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

**పీఎం సూర్యఘర్ పథకం వివరాలు**

| వినియోగం (యూనిట్లలో) | సోలార్ కెపాసిటీ (కిలోవాట్‌లలో) | సబ్సిడీ |
|---|---|---|
| 0–150 | 1–2 | రూ.30 నుంచి రూ.60 వేలు |
| 150–300 | 2–3 | రూ.50 నుంచి రూ.78 వేలు |
| 300 లోపు | 3 | రూ.78 వేలు |

**ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం**

వినియోగదారులే సోలార్ విద్యుత్ ఉత్పత్తిని చేసుకునే సూర్యఘర్ మంచి పథకం. సోలార్ విద్యుత్ ప్యానల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. రుణ సదుపాయం కల్పిస్తోంది. 6–7 ఏళ్లలో పెట్టిన పెట్టుబడి తిరిగి పొందవచ్చు. నెట్ మీటరు విధానం మూలాన విద్యుత్ ఉత్పత్తి వాడకం తెలుసుకోవచ్చు. సందేహాలు ఉంటే విద్యుత్ అధికారుల ద్వారా నివృత్తి చేసుకునే అవకాశం ఉంది. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం.

– వెంకటముని, ట్రాన్స్‌కో ఏడీఈ, నగరి